Namasthe Telangana 01-02/11/18.

# మన మెట్రోకు మరో ప్రతిష్ఠాత్మక అవార్డు



కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో సీఈవో,ఎండీ కేవీబీ రెడ్డి

## మూడు స్టేషన్లకు గ్రీన్ ప్లాటినం పురస్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ మెట్రోరైలుకు మరో ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. నగరంలోని మూడు స్టేషన్ల (రసూల్‌పుర, ప్యారడైజ్, ప్రకాశ్‌నగర్) నిర్మాణాలు పర్యావరణహితంగా ఉండటంతో వాటిని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) గ్రీన్ ప్లాటినం అవార్డుకు ఎంపికచేశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో గురువారం జరిగిన ఐజీబీసీ సమావేశంలో కేంద్ర గృహనిర్మాణశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరి చేతులమీదుగా మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్‌అండ్‌టీ మెట్రో సీఈవో/ఎండీ కేవీబీ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా కర్బన ఉద్గారాలను తగ్గించే నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న ఐజీబీసీ.. పాయింట్ల ఆధారంగా ప్లాటినం, గోల్డ్, సిల్వర్ రేటింగ్‌లను ఇస్తున్నది. హైదరాబాద్ మెట్రోరైలు స్టేషన్ల నిర్మాణంలో సహజవనరులను ఉపయోగించుకున్నట్టు తేలడంతో గ్రీన్ ప్లాటినం అవార్డుకు ఎంపికచేశారు. దీనిపై హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సంతోషాన్ని వ్యక్తంచేస్తూ.. ఈ అవార్డును అందుకోవడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో అన్ని మెట్రో రైలు స్టేషన్లను ఓపెన్ స్టేషన్లుగా నిర్మించామని, సహజమైన వెలుతురు, గాలి వచ్చేలా వాటిని డిజైన్‌చేయడంతోపాటు ఎల్ఈడీ లైట్లు, సోలార్ ప్యానెల్స్ అమర్చి ఇంధనాన్ని పొదుపుచేస్తున్నట్టు తెలిపారు. ఎల్‌అండ్‌టీ సీఈఓ/ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. ఐజీబీసీ గ్రీన్ ప్లాటినం అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని, మెట్రోరైలు బృందం కృషివల్లే ఇది సాధ్యమైందని అన్నారు. హైదరాబాద్ మెట్రోరైలు మొత్తం 75 పాయింట్లు సాధించి ప్లాటినం అవార్డుకు ఎంపికైందని చెప్పారు.